# ఎక్కువే

"అంతేనా?" అంది సుందరి.

"అంతే కాక ఇంకే ముంటుంది? అదే ఆఫీసు. అదే మనుషులు. మెడలు విరిగేట్టు చాకిరీ చేసి నా స్కూటరెక్కి నా ఇంటికి వచ్చాను. గొర్రె తోక జీవితంలో ఇంకే ముంటాయి విశేషాలు?" కాఫీ అంతా ఒక్క గుక్కలో ముగించి విశ్రాంతిగా కుర్చీలో జేరగిల బడ్డాడు ప్రకాశం.

"అంతే లెండి..." అంటూ ఖాళీ కప్పు పుచ్చుకుని లోపలి కెళ్ళి పోయింది సుందరి.

సాయంత్రం ఇంటి కొస్తూనే కాఫీ చప్పరిస్తూ ఆఫీసు కబుర్లు, ఊళ్ళో విశేషాలు సుందరి చెవిలో ఊదడం ప్రకాశానికో హాబీ.

ఎందుకో గాని ఇవాళంతా చిరాకుగా ఉంది.

ఆఫీసర్ అక్షింతలు వేశాడు. మెమో ఇచ్చాడు. పెళ్ళానికి చెప్పుకోవడానికి లేదు. అవమానం.

తనే ఆఫీసరై పోతే బాగుణ్ణనుకున్నాడు ప్రకాశం. అవలేదు. తనే స్వయంగా ఓ ఆఫీసు పెట్టు కోవాలి. కాని పెట్టుకో లేదు. సగటు జీవితం. గొర్రెతోక.

"అయితే అంతే నన్న మాట" అంది సుందరి లోపల్నుంచి, ఏదో బేరం చేస్తున్నట్టు.

"ఆఁ... నీ మొగుడు మహా జిల్లా కలెక్టరనీ... బోల్డు విశేషా లుంటాయి చెప్పుకోవ డానికి! కేంపులూ... మీటింగులూ... వగైరా వగైరా... ఓహ్! మన లైఫ్ ఆర్డినరీ... ఆర్డినరీ...." దీర్ఘం తీశాడు ప్రకాశం.

సుందరి ఏం మాట్లాడ లేదు.

సుందరి ప్రకాశం అన్యోన్య మైన జంట. పెళ్ళయి రెండే ళ్ళయింది. పొరపొచ్చాలు లేవు. పుట్టినిల్లూ మెట్టినిల్లూ కాక మూడో ఊళ్ళో కాపురం. పెద్దల జోక్యాలు లేవు. ఒకరి కొకరు తోడూ నీడా.

ప్రకాశం కష్ట జీవి. చురుగ్గా ఉంటాడు.

సుందరి పల్లెటూ రమ్మాయి.

టెన్త్ మూడు సార్లు ఫెయి లయింది. తెలివి ఉంది కానీ చదువు అబ్బ లేదు. మనిషి బాగుంటుంది. కాసింత ఛాయ తక్కువైనా చూడ చక్కని కళ.

“పొట్టిగా లావుగా ఉంటాను కదూ?” అంటుంది సుందరి బుంగ మూతి పెట్టి.

“ముద్దుగా బొద్దుగా ఉంటావు... నాకు చాలా ఇష్టం....” అంటాడు ప్రకాశం.

అయినింటి సంబంధం. పెద్దలకు ఎంత గానో నచ్చింది. వదులుకో కూడదు.

ప్రకాశానికి చాలా సంబంధా లొచ్చినా సుందరినే కోరుకున్నాడు. చదువు తక్కువైనా సంసార పక్షంగా ఉంటుందనే ఒప్పుకున్నాడు.

సుందరి మరీ ఇంటి పిల్లి లాంటిదే. ఒకంతట ఇల్లు కదలదు. ఎక్కడికీ వద్దంటుంది. ఇల్లు చక్క దిద్దడం లోనే సంతోషం. చాకిరీ చేసి అలిసి పోయినా విసుక్కోదు. చిరాకు పడదు. అవును ఇంటికి దీపం ఇల్లాలే అనుకుంటాడు ప్రకాశం.

మర్నాడు సాయంత్రం ప్రకాశం గుమ్మం లోనే కొంచెం తత్తర పడ్డాడు. వేరే ఇంటికి వచ్చానా అనుకున్నాడు. లేదు మనిల్లే అన్నట్టు ఎదురొచ్చింది సుందరి. శుక్రవారం కాదు. ఆ రోజు ఏం పండుగా అనుకున్నాడు.

ఇల్లంతా యమ నీటుగా ఉంది. పేము కుర్చీల్లో కుషన్లకి కొత్త కవర్లు. కడిగిన గచ్చు మీద కొత్త ముగ్గులు. ఫ్లవర్ వేజ్‌లో పువ్వులు. ఎక్కణ్ణుంచో అగరొత్తుల ఘుమఘుమ. కుర్చీలో కూచునే లోగానే బజ్జీల ప్లేటు ముందు కొచ్చింది.

“ఏంటోయ్ ఇవాళ స్పెషల్? నేనేం మర్చిపోలేదు. మన మ్యారేజ్ డే కాదు. నీ బర్త్ డే కూడా కాదు. నా బర్త్ డే కాదు...” అన్నాడు ప్రకాశం.

“బజ్జీలు తినడానికి అవన్నీ కావాలా?” అంటూ ఓ బజ్జీ తుంచి నోట్లో

పెట్టింది.

దగ్గరగా వచ్చే సరికి సుందరి ఒంటి నుంచి సుతి మెత్తటి స్నానపు వాసన గుబాళించింది. స్వర్గంలో తేలుతున్నాడు ప్రకాశం. ఆడవాళ్ళకి ఏ దొచ్చినా పట్టలేం అంటారు ఇందుకే కాబోలు అనుకున్నాడు. బజ్జీల తరువాత కాఫీతో అతను టీవీ చూస్తుండగా సుందరి మళ్ళీ వంటింట్లోంచి చాలా సేపు రకరకాల శబ్దాలు తెప్పించింది.

"వేణ్ణీళ్ళు పెట్టాను స్నానం చెయ్యండి" అని పురమాయించే సరికి ఆశ్చర్య పోయాడు ప్రకాశం.

ఇది వరకు రెండో పూట వేణ్ణీళ్ళ స్నానం ఉండేది. తర్వాత బద్ధకించి మానేశాడు. ఎప్పుడైనా మరీ బడలిక అయితే చన్నీళ్ళు దిమ్మరించు కోవడమే. స్నానానికని ఓ హంగామా చెయ్యడం బోరనిపించింది.

"లేవమంటుంటే..." అంటూ బలవంతంగా చేయి పట్టుకుని బాత్ రూం లోకి లాక్కు పోయింది.

దగ్గరుండి స్నానం చేయించింది. గాజుల చేయి వీపు రుద్దుతుంటే భూలోక వైకుంఠమే.

"ఏదైనా పతివ్రతల కథల పుస్తకం చదివావా?" అన్నాడు ప్రకాశం ఉండ బట్టలేక. "అహఁ... లేకుంటే నువ్వు పతివ్రతవి కావని కాదు..." అన్నాడు తన మాటని తానే సవరించు కుంటూ.

గలగల మని నవ్వింది సుందరి.

కొంచెం ఎక్కువగా నవ్విన ట్లనిపించింది.

తినలేక పోయాడు ప్రకాశం. మరీ అన్ని వంటకాలా? బర్ఫీ చేసింది చాలక మళ్ళీ పాయసం ఎందుకూ?

గారెలు, పకోడీలు, ఆకు కూర పప్పు.

వెన్న పూస, వడియాలకు తోడు అప్పడాలు.

మజ్జిగ, పెరుగు, మైసూరు రకం తీపి రసం, కాకర కాయ బజ్జీ, పెరుగు.

వామ్మోయ్! వంటల కన్నా ఎక్కువయి పోయింది వడ్డన.

"కాస్త తినండి... వద్దన కండీ... కష్ట పడి చేశాను... ఇవి మీ కిష్ట మని వేయించాను... చూడండీ... పెట్టిన వన్నీ తినకుంటే నా మీద ఒట్టు..."

"సుందూ! నువ్వు తిను... తినడం ఎంత కష్టమో తెలుస్తుంది..." అంటూ ఆమె వైపు సూటిగా గుచ్చి గుచ్చి చూశాడు ప్రకాశం.

"నిజం చెప్పు... ఏదైనా విశేషమా?"

"ఏముంటుం దండీ... భార్య భర్తకు వండి పెట్టడానికి విశేషం ఉండాలా?..." అంది సుందరి.

"ఏయ్... నిజం చెప్పు... ఈ మధ్యన ఎప్పుడైనా నాకు తెలీకుండా లేడీ డాక్టర్ దగ్గరికి వెళ్ళావా?..." నెమ్మదిగా అడిగాడు ప్రకాశం.

ఇప్పట్లో పిల్లలు వద్దను కున్నారు. అందుకే ఆమెకో ఏర్పాటు చేయించు కున్నారు. తనకు తెలీకుండా దాన్ని తీయిం చేసుకుందా?

శుభవార్తని ఇలా చెప్పాలను కుంటోందా?

అతని అనుమానం అర్థం కావడంతో ఆమె బుగ్గలు పూర్తిగా ఎరుపెక్కాయి.

"ఛ... అట్లాంటి దేం లేదు..."

"అట్లాంటి దైతే... ఛ... ఎందు కవుతుంది గానీ... మరేం టమ్మా?..." అన్నాడు ప్రకాశం.

"మరేమీ లేదు... మీరీ మధ్యన బాగా చిక్కి పోతున్నారు... అందుకనీ..." అంటూ మరి రెండు గారెలు వడ్డించింది. "ఒక్కటి వదిలి పెట్టినా ఊరుకోను..." అంది సుందరి గోముగా.

గారెలు బాగున్నాయి. వదల బుద్ధి కాలేదు.

భుక్తాయాసం తీరడానికి డాబా మీద పచార్లు చేస్తుండగా తమల పాకులు తెచ్చింది సుందరి. ఒక్కో ఆకూ శుభ్రంగా చీర కొంగుతో తడి ఒత్తి చిలకలు చుట్టి అందించింది. తాంబూలం మీద ఓ ఫిల్టర్ సిగరెట్ కూడా దట్టించే సరికి మబ్బుల దారిలో స్వర్గానికి బెత్తెడు దూరంలో విహరించ సాగాడు ప్రకాశం.

అతనలా అరమోడ్పు కళ్ళతో వెన్నెల్ని తాగుతూ పొగ మేఘాల గుండా రాత్రి సౌందర్యాన్ని ఆస్వాదిస్తుండగా ఆమె ఇల్లంతా సర్దేసి బెడ్ రూంలో పడకలు సర్దింది. చాలా పొద్దు పోయినట్టు అతను పక్క మీద వాలిపోయే సరికి అసలు జీవితం అప్పుడే మొదలయిం దన్నట్టు సుందరి నయగారాలతో కవ్వించడం మొదలెట్టింది.

ముద్దుగా బొద్దుగా ఉంటుం దని ఊరికే ముఖ ప్రీతికి అనడు ప్రకాశం. నిజంగా సుందరి శరీరంలో అణువణువూ తీర్చి దిద్దిన శిల్పంలా ఉంటుంది.

రాత్రి వెన్నెల నీడల్లో ఆ శిల్పానికి ప్రాణం వచ్చినట్టు కొత్త సొగసులు చెలరేగు తున్నట్టు అనిపించింది. ఎప్పుడూ చూసే మనిషే అయినా రాత్రయితే ఆ మనిషే అప్సరసగా మారినట్టు అయింది.

ఇల్లు ఊడ్చింది ముగ్గులు పెట్టింది ఈ మనిషేనా? గోటి నొక్కులతో రెచ్చ గొడుతున్న ఈ అందాల బొమ్మ సాయంత్రం నుంచి వంట చేస్తూ గడిపిందా?

నమ్మ బుద్ధి అవదు.

జీవితంలో ఇంత వరకు చెయ్యని దేమిటో చెయ్యా లన్నట్టు, ఇన్నాళ్ళూ తోచని ఊహ లేవేవో ఇప్పుడే తోచినట్టు, ఇదే తొలి ప్రణయ మైనట్టు... అంతా కొత్త కొత్తగా ఉన్నట్టు అనిపించింది ప్రకాశానికి.

మామూలుగా అయితే... అతను తొందర పడడం ఆమె కుదురుగా బుద్ధి చెప్పడం అతను బ్రతిమి లాడడం అన్నిటికీ ఆమె అయిష్టంగా ఒప్పుకోవడం... ఇదీ పరిపాటి.

అదంతా పాత చరిత్ర అయినట్టు సుందరి వెన్నెల బొమ్మలా కదులుతూ ప్రకాశాన్ని చుట్టుకుని ఊపిరాడని ముద్దులతో ముడివేసి తామర తూడు ల్లాంటి చేతులతో బంధించి వేసింది. ముడిబడ్డ ఊపిరులు ఆ వేళ సముద్రాల మీద పెను తుపానుల్లా ఊగాయి. అనంత ఆకాశం సముద్ర అగాధం ఏక మయినంతగా ఆనంద కెరటాలు పొంగాయి.

"లవ్‌లీ సుందూ...!.." అంటూ వాలి పోయిన ప్రకాశం ముఖాన్ని పుచ్చుకుని వదలకుండా ముద్దాడింది సుందరి. "నేను బాగున్నానా?" అని అడిగింది.

"అదేంటి... కొత్తగా?..." అన్నాడు.

గొప్ప విజయం సాధించినట్టు అలసట తెరల మధ్య నవ్వుకుంటోంది.

గట్టి నిద్ర పట్టేసింది ప్రకాశానికి.

నిద్రలో పరిమళంలా కమ్మిందో కల.

సుందరి తనని అమాంతం గాలి లోకి లేపి బంతిలా ఎగరేస్తోంది. ఎగరేసి ఎగరేసి ఎక్కడ విసిరేస్తుందో నని భయ పడుతున్నాడు తను.

"వద్దు వద్దు..." అంటూ గింజుకుం టున్నాడు.

"ఊఁ... కావాలి..." అంటూ లాగుతోంది సుందరి.

కల కాదు. నిజమే. సుందరి మళ్ళీ అల్లుకుంటోంది. మెలిక పడుతోంది. అతనికి కొంచెం ఇబ్బందిగా ఉంది. అలసట ఇంకా తీరలేదు.

ఆమె మోహం పెద్ద కెరటంలా విరిగి పడుతోంది. మగతనాన్ని సవాలు చేసే శక్తి అది. పట్టుదల పెరిగినట్టు అతనూ అల్లుకున్నాడు.

వెన్నెల్లో మబ్బు నీడలు కదులు తుండగా రాత్రి నిట్టూర్చినట్టు పడగ్గది అబ్బుర పడింది. ఈ జన్మ కిక చాలు అనుకున్నాడు... "థేంక్యూ సుందూ... నువ్వు చాలా గ్రేట్! రియల్లీ స్వీట్!" అంటూ అనుకుంటూ మత్తు నిద్ర లోకి జారిపోయాడు.

ఎన్ని నిమిషాలో ఎన్ని గంటలకో గానీ... మళ్ళీ ఏదో కల అనుకున్నాడు కానీ కల కాదు...

సుందరి మళ్ళీ అల్లుకుంటోంది. లతలా పెన వేస్తోంది. ముద్దులతో ముద్రలు వేస్తూ మురిసి పోతోంది. నవ్వుతోంది. వీడి పోయిన జుత్తు ఆమె భుజాల మీద విచ్చల విడిగా పరుచుకుని నిశీథి చీకటంతా ఆమె మీదికి వాలినట్టు అనిపిస్తోంది.

"సుందూ! ఇక వద్దు ప్లీజ్"

"కావాలంటే..." అంటూ హత్తుకుంది.

ప్రకాశం గొంతు తడి ఆరిపోయింది.

రేగి పడుతున్న ఆమె ఊపిరి సుడిగుండంలా తిప్పేస్తోంది. ఒక శక్తి ఒక సవాలు. ఒక వాంఛ. ఒక జ్వాల. ఇక మళ్ళీ ఇలా చెయ్య దనుకున్నాడు.

కనురెప్పల మీద కాపురానికి వచ్చినట్టు కమ్మేసింది నిద్ర. కలలు రానంత గాఢ నిద్ర. బండలా బిగిసి పోయింది శరీరం. ఎవరో బండనే పగుల గొడుతున్నట్టు వికారంగా కుదుపు తున్నట్టు.

"ఏంటి?" అన్నాడు ప్రకాశం.

ఆమె మళ్ళీ కదులు తుండడంతో మొద్దు బారిన మెదడు కూడా విరిగి పడిన ట్టయింది.

"పిచ్చా నీకు? పడుకో ఇంక"

"ఊc... నేను బాగున్నానా అయితే?"

ఒళ్ళు మండింది. చెంప మీద ఒక్క టిచ్చాడు. "దెయ్యం గాని పట్టిందా నీకు? తమాషాకు కూడా హద్దుండాలి. పడుకో మంటే..." అంటూ తను అలాగే కళ్ళు మూసుకున్నాడు.

అగాధం లాంటి నిద్ర లోకి సర్రున వెళ్ళి పోయేంతలో ఏ కనుమ లోంచో వినిపించినట్టు సన్నని మూలుగు... అతి సన్నటి ఏడుపు.

"ఓగ్గాడ్" అనుకుంటూ లేచి చూస్తే మంచం పక్కన కుప్పలా ముడుచుకుని కూచుని ఏడుపు అణుచు కుంటూ కుళ్ళి కుళ్ళి కుమిలి పోతోంది సుందరి. నమ్మ లేక పోతూ "ఏంటి సుందూ? ఏమైంది?" అన్నాడు గాభరాగా.

"ఏం లేదూ... పడుకోండి... రెస్ట్ తీసుకోండి..."

"నువ్వు ఏడుస్తుంటే నాకు మంచి రెస్టే...!... ఎంత అడిగినా చెప్పవు! ఇవాళంతా కొత్త మనిషిలా వున్నావు... ఆ డెకరేషన్లూ ఆ వంటలూ... హడల గొట్టేశావు... ఇప్పుడీ పడగ్గది భాగోతం... హవ్వ... ఏంటిది? ఎక్కడ దాచావ్ ఇంత ఆవేశం? ఏమైంది? ఆ కన్నీరేంటి? ఏమైంది ఇంతకీ... చెప్పవా?..."

"చెప్తే మీరు ఇంకా కోప్పడతా రేమో కదూ?"

"చెప్పక పోతే ఇంకా కోప్పడతాను"

"మీరు చెప్పక పోతే నేనేం కోప్పడ లేదు కదా?"

"నేను ఏం చెప్ప లేదు నీకు?"

"అన్నీ చెప్తారు లెండి... అసలువి మాత్రం చెప్పరు..." నిష్ఠూరం గుప్పిస్తూ చూపు తిప్పుకుంది.

"సుందూ! నీతో చెప్పకుండా ఏం దాచానని? అసలువి అంటే ఏమిటి?" అన్నాడు ప్రకాశం.

రుసరుసని అణుచు కుంటూ ముక్కు పుటాలు ఎగరేసింది. "మూడు రోజుల క్రితం... సాయంత్రం మీ ఆఫీసమ్మాయి... వనజని...స్కూటర్ మీద తీసుకెళ్ళి వాళ్ళింట్లో దిగబెట్టారు కదూ మీరు! నాతో చెప్పారా? వాళ్ళింట్లో అరగంట పైగా వున్నారు... నాతో చెప్పారా? నేను పల్లెటూ రమ్మాయిని... నాజూగ్గా ఉండను కదూ?"

"సుందూ సుందూ... అపార్థం సుందూ..."

"మీరు వనజను వాళ్ళింట్లో దిగ బెట్టడం చాలా సేపు వాళ్ళింట్లో నే ఉండడం మన ఎదురింటి మామీ చూసింది... మామీ వాళ్ళ పెద్ద మామయ్య ఇల్లు ఆ వీధి లోనే..."

గిర్రుమని కళ్ళు తిరిగాయి ప్రకాశానికి. "అయితే... అందుకని నువ్వు..."

"అదే కద మరి... నేను మీకు ఏదో తక్కువ చేసి ఉండాలి... ఏం తక్కువ చేశానా అని... అందుకే..." అంటూ విరిగిన కెరటంలా ఏడుపుతో విరుచుకు పడింది.

ఇల్లంతా అలంకారాలూ పెళ్ళి భోజనాల్లా వంటలూ పడకింట్లో

విశృంఖల విహారం... చెదిరి నలిగిన ఆమె అలంకరణ అంతా ఆవేశంగా అదిరి పడుతూనే ఉంది ఇంకా.

నవ్వో ఏడుపో తెలీనట్టు నలిగి పోతూ ఆమెను మెల్లిగా తాకాడు ప్రకాశం... "వనజ వాళ్ళింటికి ఎందు కెళ్ళానంటే సుందూ... వాళ్ళ పిన్నమ్మకు సీరియస్ అని కబురొస్తే... ఆమె అర్జెంట్‌గా వెళ్ళాలంటే..."

తల విదిలించింది సుందరి. "ఎన్నయినా చెప్పొచ్చండీ... కానీ ఇప్పుడు కాదు... అప్పుడే ఎందుకు చెప్ప కూడదూ?... మర్నాడయినా చెప్పలేదు. ఇప్పుడైనా నేను అడిగితేనే కదా! మీ ఆఫీసులో గుండు సూదుల డబ్బా కింద పడినా అదో విశేషంగా చెప్తారు కదా... ఇది మాత్రం... ఇది మాత్రం..."

"సో సారీ... నన్ను నమ్ము... ఒట్టు..." చెప్తూ చెప్తూనే ఆమె కళ్ళలోకి చూసి నవ్వాడు ప్రకాశం. "మా బాస్ నిన్న తిట్టాడు నన్ను... మెమో కూడా ఇచ్చాడు... ఇది కూడా చెప్పలేదు నీకు... కొన్ని చెప్పలేం..." అని తల దించుకునే సరికి...

ఆమె కళ్ళు విచ్చుకుని చూసింది.

"తిట్లు తిన్నారా? హయ్యో ఏమండీ... పాపం..." అంటూ గుండెల కేసి గట్టిగా హత్తుకుంది. మరి కాస్సేపటికి మంచం మీద వాలుతూ "రండి మరి" అంది సుందరి.

"బాబోయ్ మళ్ళీనా? లేదు. నువ్వేం తక్కువ చెయ్యలేదు. అన్నీ ఎక్కువే చేశావు. మరీ మరీ ఎక్కువే చేశావు... నిజం... ప్లీజ్..." అన్నాడు ప్రకాశం చేతులు జోడిస్తూ.

ముగ్ధ మనోహరంగా ఫక్కున నవ్వింది సుందరి.

కొంచెం ఎక్కువ గానే.

22.05.1995 సంచిక